సమర స్ఫూర్తి..పులకించిన దేశభక్తి


మహిళలతో కలిసి ర్యాలీలో నడుస్తున్న ఎమ్మెల్యే

- ముందస్తు స్వాతంత్య్ర వేడుకలతో మురిసిన మదనపల్లె
- 3వేల మంది డ్వాక్రా. మెప్మా మహిళలతో భారీ ర్యాలీ
- అలరించిన పద్మశ్రీ శోభారాజు గీతాలాపన


దేశభక్తి గీతాలకు నృత్యం చేస్తున్న చిన్నారులు


గీతాలాపన చేస్తున్న పద్మశ్రీ డాక్టర్ శోభారాజు


ర్యాలీలో కనువిందు చేసిన కీలుబొమ్మల నాట్యం

మదనపల్లె : స్వాతంత్య్ర దినోత్సవ ముందస్తు వేడుకలతో మదనపల్లె పట్టణం మురిసిపోయింది. ఎక్కడ చూసినా తిరంగా జెండా రెపరెపలాడుతూ కనిపించింది. వందేమాతరం, భారత్ మాతా కీ జై, ఇంక్విలాబ్ జిందాబాద్, మేరా భారత్ మహాన్ నినాదాలతో పులకరించిపోయింది. ఉదయం 11 గంటల నుంచి అర్ధరాత్రి 12.33 నిమిషాల వరకు స్వాతంత్య్ర నినాదాలతో, దేశభక్తి గీతాలతో, జెండా రెపరెపలతో పట్టణ ప్రజానీకం మొత్తం దేశభక్తిని చాటింది. స్వాతంత్య్ర దినోత్సవ కమిటీ–2024 ఆధ్వర్యంలో బుధవారం మిషన్ కాంపౌండ్ నుంచి డ్వాక్రా, మెప్మా మహిళాసంఘాల సభ్యులతో నిర్వహించిన ర్యాలీకి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. సబ్ కలెక్టరేట్, చిత్తూరుబస్టాండ్, అప్పారావువీధి, బెంగళూరు బస్టాండ్ శ్రీకృష్ణదేవరాయసర్కిల్ మీదుగా అనిబిసెంట్ సర్కిల్ వరకు ర్యాలీలో జాతీయజెండాలు పట్టుకుని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మహిళలతో కలిసి ముందుకు సాగారు. స్వాతంత్య్ర ఉద్యమంలో పోరాటాల పురిటిగడ్డగా పేరుమోసిన మదనపల్లె ఖ్యాతిని భావితరాలకు చెప్పేందుకు ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. మూడురోజుల పాటు జరిగిన కార్యక్రమాల్లో దేశభక్తిని, సమైక్యతను చాటిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన దేశభక్తి గీతాలు

సర్వమత ప్రార్థన గీతాలాపన అనంతరం దేశభక్తి పాటలకు విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్.శోభారాజు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, దేశభక్తి గీతాలు సభికులను అలరించాయి. కార్యక్రమానికి హాజరైన ప్రజలు ఆమె తియ్యని కోకిల గానామృతానికి మైమరచిపోయారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఎస్పీ కొండయ్యనాయుడు, తహసీల్దార్ ఖాజాబీ, స్వాతంత్య్ర ఉద్యమ కమిటీ కన్వీనర్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, కో కన్వీనర్ సేతు, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, లక్ష్మీనారాయణ, పోర్డ్ లలితమ్మ, పీటీఎం.శివప్రసాద్ పాల్గొన్నారు.

కస్తుర్బా పాఠశాల వసతులపై తనిఖీ

– ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి


కస్తూర్బా గురుకుల పాఠశాలలో సమస్యలను తెలుసుకుంటున్న ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి

కలకడ : కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న ఆహారంపై వాయల్పాడు సివిల్ కోర్టు జడ్జి, ఏపీజీ అశోక్‌కుమార్‌రెడ్డి, బార్ అసోషియేషన్ అధ్యక్షులు ఆనంద్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కలకడ కస్తూర్బా గాంధి బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశామన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులు పరిశీలించారు. అనంతరం గ్రంథాలయం చూసి కేవలం రెండు షెల్డర్‌లలో మాత్రమే పుస్తకాలు ఉండటం, విద్యార్థులకు చదువుకునే తరగతి గదిలోనే ఉండటం ఏమటని సిబ్బందిని ప్రశ్నించారు. ఇంటర్ బైపీసీ చదువుకునే విద్యార్థినిలకు కనీసం ల్యాబ్ లేకపోతే వారికి ఏవిధంగా విద్యాభ్యాసం అందుతుందన్నారు. నాడు–నేడు పనులలో కేటాయించిన గదులు పూర్తి అయితే మరిన్ని వసతులు సమకూరుతాయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. అనంతరం విద్యాబోధన, సిబ్బంది కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా రహస్యంగా అయినా చేరవేయవచ్చని తెలిపారు

వినూత్న ప్రయోగాలపై దృష్టి సారించాలి

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె సిటీ: విద్యార్థులు సొంత ఆలోచనల మేరకు వినూత్నమైన ప్రయోగాలపై దృష్టి సారించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి ఇన్స్పైర్ మనక్ కార్యక్రమంపై గైడ్ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఇన్‌స్పైర్ ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రదర్శనలు ప్రదర్శించే అవకాశం పిల్లలకు దక్కుతుందన్నారు. వినూత్నమైన ఆలోచనలకు పేటెంట్ హక్కులను కూడా పొందే అవకాశం ఉందన్నారు. జాతీయస్థాయిలో ఎంపికైన 60 ప్రాజెక్టులను రాష్ట్రపతి భవన్ నందు ప్రదర్శనలు ప్రదర్శించే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఇన్స్పైర్ మనక్ డివిజన్ రిసోర్సుపర్సన్ భాస్కరన్ మాట్లాడుతూ నామినేషన్లు ఆన్‌లైన్ విధానంలో కాకుండా, ఇన్‌స్పైర్ మనక్‌లో అప్‌లోడ చేసే విధానాన్ని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచే అన్ని అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు తప్పనిసరిగా సెప్టెంబర్ 15లోపు ప్లిల వినూత్న ఆలోచనలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్ రెడ్డి, రాజగోపాల్, రిసోర్సు టీం సభ్యులు పిఎల్ఎన్ శాస్త్రి, వరప్రసాద్, హెచ్ఎం సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కదిరి పట్టణం పార్థసారధి కాలనీకి చెందిన జయరాం(48) తన స్నేహితుడు వెంకటేష్‌నాయక్(47)తో కలిసి ద్విచక్రవాహనంలో కురబలకోట మండలం విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో కుమార్తెను చేర్పించేందుకు బయలుదేరి వచ్చాడు. మార్గమధ్యంలో కురబలకోట మండలంలోని దొమ్మన్నబావి సమీపంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అదేవిధంగా మదనపల్లె పట్టణం అనపగుట్టకు చెందిన నాగేశ్వర(60) ద్విచక్రవాహనంలో రింగ్‌రోడ్డు వద్ద వస్తుండగా, ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బసినికొండకు చెందిన హుస్సేన్(65) ద్విచక్రవాహనంలో పుంగనూరు రోడ్డు వద్ద ఉన్న సచివాలయం సమీపంలో రోడ్డు దాటుతుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వాల్మీకిపురం తహసీల్దార్‌గా పామిలేటి

వాల్మీకిపురం: వాల్మీకిపురం తహసీల్దార్‌గా పామిలేటి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న ఆయన బదిలీపై వాల్మీకిపురంకు తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

కేవీపల్లె తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కేవీపల్లె : మండల తహశీల్దార్‌గా కార్తీక్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటామని తెలిపారు. రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

ములకలచెరువు సీఐగా రాజా రమేష్

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా సత్యసాయి జిల్లాలో పని చేసే రాజా రమేష్ నియమితులయ్యారు. ఇన్నాళ్ళూ ఇక్కడ సీఐగా పని చేస్తున్న తమ్మిశెట్టి మధు అన్నమయ్య జిల్లా వీఆర్‌కు వెళ్లారు.

గుర్రంకొండ ఎస్ఐగా మధురామచంద్రుడు

గుర్రంకొండ: గుర్రంకొండ ఎస్ఐగా మధురామచంద్రుడు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి బదిలీపై కర్నూలు వీఆర్‌కు వెళ్లారు. అనంతపురం జిల్లా పుట్టపర్తి పోలీస్‌స్టేషన్లో ఎస్ఐగా పనిచేస్తున్న విధులు నిర్వహిస్తున్న మధురామచంద్రుడు బదిలీపై గుర్రంకొండకు వచ్చారు.

నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన

పీలేరు రూరల్ : పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం పీలేరు పట్టణంలో ఐఎంఏ వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులపై దాడులు అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యుల రక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీలేరు ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రశేఖర్, సెక్రటరీ డాక్టర్ వై. పవన్‌కుమార్, సీనియర్ వైద్యులు సహదేవయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలకడ ఎస్ఐగా రామాంజనేయులు

కలకడ : కలకడ ఎస్ఐగా బి. రామాంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తూ ఉన్న ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి సాధారణ బదిలీలలో భాగంగా కర్నూలు రేంజ్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు అందాయి. యాదమర్రి ఎస్ఐగా ఉన్న రామాంజనేయులను కలకడకు బదిలీ చేశారు.

జరిమానా

పెద్దతిప్పసముద్రం: మండలంలో రెండు రోజుల క్రితం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పట్టుబడిన ట్రాక్టర్ యజమానికి రెవెన్యూ అధికారుల సమక్షంలో రూ.10 వేల జరిమానా విధించామని ఎస్ఈబీ సీఐ రాంమోహన్ పేర్కొన్నారు.

15 August Independence Day స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు

బాలల ఆరోగ్యం.. దేశానికి సౌభాగ్యం

పీలేరు : బాలల ఆరోగ్యం.. దేశానికి సౌభాగ్యమని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 20న నిర్వహించనున్న నులిపురుగుల నివారణ దినోత్సవంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాల, కళాశాల, అంగన్‌వాడీ కంద్రంలో 1–19 మధ్య వయస్సు పిల్లలకు వందశాతం ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

పెద్దతిప్పసముద్రం: ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ కేఎస్ బాలాజీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం ఆయన ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా అమలవుతున్న రాయితీ పథకాలపై రైతాంగ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించినా, ప్రజల నుంచి ఫిర్యాదులు అందినా శాఖా పరమైన చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు.

ఆర్టీసీ సిబ్బందికి రీజనల్ స్థాయి పురస్కారాలు

మదనపల్లె సిటీ: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఆర్టీసీ సిబ్బందికి రీజనల్ స్థాయి పురస్కారాలు దక్కినట్లు ఆర్టీసీ–1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆర్.రవి, ఎంఎఫ్, ఎం.రేవతి, సీఐ, లతీఫ్ (మెకానిక్), ఎం.ఆర్.క్రిష్ణ (డ్రైవర్), వి.వి.రమణ (కండక్టర్), ఎం.ఆర్.బేగ్, ఎం.జె.ఎస్.రెడ్డి లకు గురువారం రాయచోటిలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు.

బి.కొత్తకోట సీఐగా రాజారెడ్డి

బి.కొత్తకోట: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు నూతన సీఐగా రాజారెడ్డి నియమితులయ్యారు. నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేసారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.సూర్యనారాయణను వీఆర్‌కు బదిలీ అయ్యారు.














కేవీకేలో స్వర్ణోత్సవ వేడుకలు


కేవీకేలో డ్రోన్ వినియోగంపై రైతులకు వివరిస్తున్న అధికారులు

కలికిరి: కేవీకే కార్యాలయంలో రెండు రోజుల పాటు స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేవీకే కో–ఆర్డినేటర్ డా.మంజుల మాట్లాడుతూ కేవీకేలు దేశ వ్యాప్తంగా 731 కేంద్రాలు ఉన్నాయని, మొదటగా కేవీకే ఏర్పాటై 50సం.లు పూర్తైన సందర్భంగా స్వర్ణోవ వేడుకలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆయా ప్రాంతాలను బట్టి రైతులు సాగు చేస్తున్న ప్రధాన పంటల సాగులో సస్యరక్షణ చర్యలను కేవీకే ఆధ్వర్యంలో రైతులకు తెలియచేయడం జరుగుతోందన్నారు. అనంతరం వివిధ రకాల పంటలలో పాటించాల్సిన సాగు పద్దతులు, డ్రోన్‌తో పంటలపై పిచికారీ, ఎరువుల వినియోగం, నేల ఆరోగ్యం తదితరాలపై కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ డా.మహేశ్వర్‌రెడ్డి, డిఆర్‌పీ మారుతి మహేష్, కేవీకే శాస్త్రవేత్తలు డా. ఎ.శ్రీనివాసులు, సోమశేఖర్ బాబు, పీరూసాహెబ్, మాధురి, ఏఒ మమతారెడ్డి, ఉద్యాన శాస్త్రవేత్త డా.శేష కిరణ్, రైతులు పాల్గొన్నారు.







